క్లుప్తంగా

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం శ్రావణ మాసం మాఘ నక్షత్రం అమావాస్య శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

29 మంది దివ్యాంగులకు పింఛన్ నిలిపివేత

జె.పంగులూరు: మండల పరిధిలోని 21 గ్రామాలకు సంబంధించి 29 మందికి వికలాంగుల వివిధ కారణాలతో పింఛన్ ఆగినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె. సుమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించన వారికి తిరిగి నోటీస్ పంపిచినట్లు చెప్పారు. వారు తిరిగి రీ వెరిఫికేషన్ చేయించుకొని నిజమైన లబ్ధిదారులను గుర్తించి పింఛన్ వచ్చే విధంగా చూస్తామన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మించుకున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. స్థానిక భవాని సెంటర్ వినాయకస్వామి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఎడమవైపున కాకాని పాలెం చుట్టు పక్కల ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈమేరకు శుక్రవారం విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. దామోదరం తెలిపారు.

పావులూరులో నేత్రదానం


దాత చిడిపూడి అంజమ్మ (ఫైల్)

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామానికి చెందిన చిడిపూడి అంజమ్మ(80) శుక్రవారం మృతి చెందడంతో ఆమె నేత్రాలను దానం చేశారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో వారి కుమారులు సుబ్బారెడ్డి, వెంకట రెడ్డి, అంజిరెడ్డి, కుమార్తెలు పున్నమ్మ, వెంకాయమ్మ, వరలక్ష్మి, మాజీ సర్పంచ్ పి. భద్రిరెడ్డి అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన రావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి వారి బంధుమిత్రులు పాల్గొన్నారు. రోటరీ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

శాకంబరీ దేవికి ప్రత్యేక పూజలు


శాకంబరీ దేవిగా మహాలక్ష్మమ్మ అమ్మవారు

వేటపాలెం: ఆనుమల్లిపేట మహాలక్ష్మమ్మ చెట్టు మందిరం వద్ద శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మిని వివిధ రకాల కూరగాయలతో, డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ చేశారు. సామూహిక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, మల్లిక, కోటేశ్వరమ్మ, అనంత లక్ష్మి పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో యువత నాశనం


మేదరమెట్లలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఫీ

మేదరమెట్ల: డ్రగ్స్‌ను వినియోగించడం వలన యువత చెడుదారిలోకి పోవడం తద్వారా జీవితం నాశనం చేసుకుంటామని మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ అన్నారు. జిల్లా ఈగల్‌టీం ఆధ్వర్యంలో మేదరమెట్లలోని రాధాస్ గీతం హైస్కూల్ లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు బానిసైన వారు సమాజంలో ఎందుకూ పనికిరానివారిగా మారిపోతారని చెడు అలవాట్లకు బానిసలౌతారని తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. స్కూల్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూపాయ్.. రూపాయ్ ఎక్కడున్నావ్?

- కోర్టు అవసరాలకు వినియోగించే రూపాయి స్టాంపుల కొరత
- చీరాల్లో ఇబ్బందులు పడుతున్న న్యాయవాదులు
- పట్టించుకోని అధికారులు


ఏడాది కాలంగా కనుమరుగైన కోర్టులో వినియోగించే రూపాయి స్టాంపులు


చీరాల కోర్టు సముదాయం

చీరాల రూరల్: రూపాయి స్టాంపు చేతికి చిక్కకుండా జనాలకు చెమటలు పట్టిస్తోంది. అది ఎక్కడ దొరుకుతుందో తెలియక ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. కోర్టు కార్యకలాపాలకు అవసరమయ్యే రూపాయి విలువైన స్టాంపు కొరత చీరాల పట్టణంలో వేధిస్తోంది. కనీసం కంటికి కనిపించడం లేదని న్యాయవాదులు వాపోతున్నారు. కోర్టుకు సంబంధించిన అన్ని రకాల స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయి. సంబంధిత అధికారులు స్టాంపుల అవసరతను బట్టి ఇండెంట్ పెట్టి తెప్పిస్తుంటారు. అయితే అన్ని రకాల స్టాంపులు దొరుతున్నాయి కానీ రూపాయి స్టాంపు మాత్రం దాదాపు ఏడాది కాలంగా దొరకడంలేదు.

దేనికి ఉపయోగిస్తారు?

న్యాయవాదులు ఎలాంటి పిటీషన్ ఫైల్ చేయాలన్నా వెల్ఫేర్ స్టాంపుతో పాటు రూపాయి స్టాంప్ కచ్చితంగా అంటించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రూపాయి స్టాంపు స్థానంలో రెండు రూపాయలు స్టాంపు అటింస్తున్నామని న్యాయవాదులు చెబుతున్నారు. స్టాంపులు తయారుచేసే నాశిక్ ప్రింటింగ్ ప్రెస్‌లో అన్ని రకాల స్టాంపులతో పాటు రూపాయి స్టాంపు కూడా ప్రింటింగ్ చేస్తారు. కానీ రూపాయి స్టాంపును మాత్రం కొందరు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అయితే చీరాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మినహా మిగతా చోట్ల దొరుకుతున్నట్లు సమాచారం.

ఇష్టానుసారం విక్రయిస్తున్న ఇ– స్టాంపులు

పొలం, స్థలం ఏది కొనాలన్నా మొదటగా ఎన్‌జీఏ స్టాంపు పేపర్లపై అగ్రిమెంటు చేసుకుంటారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, రేషన్ కార్డులు, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లలో కూడా స్టాంపు పేపర్లు వినియోగిస్తుంటారు. ఎంతో విలువైన ఈ ఆన్‌లైన్ స్టాంప్ పేపర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో సంబంధం లేకుండా విక్రయాలు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం అనుమతులు కలిగిన స్టాంప్ వెండర్లకు అప్పగించింది. అయితే స్టాంపు అవసరతలను దృష్టిలో పెట్టుకుని వెండర్లు ఇష్టానురీతిగా విక్రయాలు చేస్తున్నారు. రూ. 20 స్టాంపు కావాలన్నా, రూ. 50 స్టాంపు కావాలన్నా అసలు ధరతో పాటు కొనుగోలు దారులు అదనంగా డబ్బులు చెల్లించాల్సిందే.

ఏడాదిగా రూపాయి స్టాంపు రావడంలేదు

కోర్టులో వినియోగించే రూపాయి స్టాంపు ఏడాదికాలంగా రావడం లేదు. రూపాయి స్టాంపులకు కూడా ఇండెంట్ పెడుతున్నా.. రావడంలేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అన్ని రకాల స్టాంపుల విక్రయాలు చేసుకోవచ్చునని ప్రభుత్వం వెండర్లకు అవకాశం ఇచ్చింది. వారిని నియంత్రించే అధికారం మాకు లేదు.

– శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్, చీరాల

న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారు

కోర్టులో అవసరమైన రూపాయి స్టాంపు ఏడాదిగా రావడం లేదు. కోర్టులో ఎటువంటి పిటిషన్ ఫైల్ చేయలన్నా రూపాయి స్టాంపు కచ్చితంగా అంటించాలి. రూపాయి స్టాంపు దొరక్కపోవడం వలన రెండు తప్పనిసరి పరిస్థితుల్లో రెండు రూపాయిల స్టాంపు అంటించాల్సి వస్తోంది.

– జి. రమేష్‌బాబు, చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

అనుమతులు లేకుండా ఉత్సవాలు వద్దు


వినాయక విగ్రహాల ఏర్పాటుపై మాట్లాడుతున్న సీఐ, ఎస్సైలు


దగ్గుబాడులో ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఖాదర్ బాషా

కారంచేడు: గ్రామాల్లో ఎక్కడ వినాయక ఉత్సవాలు జరగాలన్నా ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని దగ్గుబాడులో వివిధ ప్రాంతాలకు చెందిన కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆయా వినాయక ఉత్సవ కమిటీలు విగ్రహాల ఏర్పాటుకు, పందిళ్ల నిర్వహణకు అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహించకూడదని తెలిపారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. విగ్రహాలు ఏర్పాటు సమయంలో కరెంటు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బల్లికురవ: వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలని సంతమాగులూరు సీఐ కె. వెంకటరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 5 గురు సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీ గుర్తింపు కార్డులతో అనుమతితో పాటు మండపాల వద్ద అగ్నిమాపక, విద్యుత్ శాఖ అనుమతులు ఉండాలన్నారు. విగ్రహం ఎత్తు, నిమజ్జన తేదీ తదితర వివరాలను పోలీసులకు తెలియజేయాలని రాత్రి 10 గంటల తదుపరి మైకులు హోరెత్తించకూడదని.. నిమజ్జన సమయంలో మత్తు పదార్థాలు సేవించరాదని సీఐ వివరించారు. సమావేశంలో బల్లికురవ సంతమాగులూరు ఎస్సైలు, నాగరాజు, పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేసుకోండి


అద్దంకి: మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి


ఇంకొల్లు: శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి

ఇంకొల్లు(చినగంజాం): రైతులందరూ చౌడు భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకొని సిద్ధం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రమాదేవి సూచించారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జీబీ ప్రవీణ, వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ విస్తరణాధికారి రాధ, ధీరజ్, అలెగ్జాండర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ కర్బనంతో భూసారం

అద్దంకి: రైతులు తమ భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. ధర్మవరం రైతు సేవా కేంద్రం వద్ద ఆత్మ ప్రకాశం జిల్లా వారి సౌజన్యంతో భూసారాన్ని పెంపొందించుటకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ కర్బనం పెంపొందించడానికి పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ పాలడుగు శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ కోట రామిరెడ్డి, మాస్టర్ ట్రైనర్ అశోక్, సర్పంచ్ చావల కళ్యాణి, శేషయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి


పర్చూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్


చినగంజాంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు


గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బండారు అనూష

పర్చూరు(చినగంజాం): మండలంలోని వివిధ శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశం హాలులో గ్రామ పంచాయతీల అభివృద్ధి సూచిక 2.0 వెర్షన్‌పై గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, మండల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజా సమస్యలను గుర్తించడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి తయారు చేసిన నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందు పరచాలన్నారు. అన్ని శాఖల డేటాను సేకరించి దాని ఆధారంగా 2025–26 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి సూచిక గురించి డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. వివిధ శాఖలకు సంబంధించి డేటా సేకరించేటప్పుడు తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి సేకరించిన డేటా ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పీఆర్‌ఏ ఇ. శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందరూ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులకు నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన డేటా పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌లో నమోదు చేసే విధానం స్లైడ్స్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంజారు అనూష, తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిరణ్ కుమార్, ఎంఈఓ శ్రీనివాసరావు, శిక్షకులు ఎస్ నారాయణ హాజరయ్యారు. వీరితో పాటు రెవెన్యూ శాఖ, ఐసీడీఎస్, అగ్రికల్చర్, మెడికల్ అండ్ హెల్త్, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్, వెలుగు, విద్య, బీసీ వెల్ఫేర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాంలో..

పంచాయతీ అభివృద్ధి పనులపై డేటాను సేకరించాలి అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పూర్ణచంద్రరావు అన్నారు. పంచాయతీ ఇండెక్స్‌లు 2.0 వెర్షన్‌పై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్వారీ ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టండి


క్వారీ ప్రమాదాలపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాలు

బల్లికురవ: గ్రానైట్, మెటల్ క్వారీలు పరిశ్రమల్లో జరుగుతున్న ఘోర ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజా సంఘాలు శుక్రవారం తహసీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 3వ తేదీ ఈర్లకొండ సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో 6గురు చనిపోయినట్లు అధికార పార్టీ అండతో ప్రకటించారన్నారు. కానీ అంతకంటే ఎక్కువ మందే మృతి చెందారని తెలిపారు. ఈ ప్రమాదం మరవకముందే సనకొండ వెంకటసాయి కంకర క్వారీలో ఛత్తీస్‌గఢ్ వలస కార్మికుడు మృతి చెందాడని.. బతుకు దెరువుకు రాష్ట్రాలు దాటి వలస వచ్చి క్వారీ యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదానికి కారణమైన క్వారీ యాజమాన్యాల పై ఎలాంటి చర్యలు ఉండటం లేదని.. కంటి తుడుపుగా పరిహారం చెల్లిస్తున్నారని తెలిపారు. క్వారీలు, పరిశ్రమలో ఎంతమంది పనిచేస్తున్నారో కార్మిక శాఖ వద్ద కూడా లెక్కలు లేనందున కార్మికుల ప్రాణాలను సెటిల్‌మెంటుతో సరిచేస్తున్నారని వివరించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మందా వీరనారాయణ, వీరయ్య, రమణయ్య, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరరెడ్డి తదితరులున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా


డ్రోన్‌తో పట్టణ పరిసరాల్లో తీసిన చిత్రాలు

అద్దంకి: అసాంఘక కార్యకలాపాలపై అద్దంకి పోలీసులు పటిష్ట నిఘా పెట్టారు. పేకాట, బహింగ ప్రదేశాల్లో మందు తాగడం, ఇతర సాంఘిక కార్యకలాపాలను గుర్తించేందుకు ఒక అడుగు ముందుకు వేసి డ్రోన్‌తో బహిరంగ ప్రదేశాలను రద్దీ ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇక తప్పు చేస్తే దొరికిపోక తప్పదని సీఐ సుబ్బరాజు హెచ్చరించారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదు


మేదరమెట్లలో అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ బీవీ సాగర్

మేదరమెట్ల: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఐఈసీ (ఇన్‌ఫరమేషన్, ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్) పై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. సాగర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలో హెచ్‌ఐవీ బాధితులు లేకుండా చూడటమేనన్నారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎం.భ్రమరాంబ, కె.సుధీర్, హెల్ప్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద భరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బూదవాడలో ప్రమాద భరింతంగా వంగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

జె.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడ గ్రామ సచివాలయంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ ఏర్పాటు చేశారు. వాటిలో ఒక ట్రాన్స్ ఫార్మర్ కింద పడిపోయే విధంగా ప్రమాద భరితంగా మారింది. ట్రాన్స్ ఫార్మర్ల అతి సమీపంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఆ దారిలో నిత్య పిల్లలు తిరుగుతూనే ఉంటారు. సచివాలయం వద్దకు గ్రామస్తులు కూడా సచివాలయం వద్ద వచ్చి పోతుంటారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాద భరితంగా ట్రాన్స్ ఫార్మరం ఉండటంపై గ్రామస్తులు భయాందోళనకు గురౌతున్నారు. దానిని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవార వ్రతాలు


అద్దంకి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింగరకొండపైనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో శ్రావణశుక్రవారంలోని ఆఖరి శుక్రవారం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. దానిలో భాగంగా ఆలయ అధికారులు మహిళలకు అవసరమైన పూజా ద్రవ్యాలను ఉచితంగా అందజేశారు. ఉత్సవ విగ్రహ మూర్తలకు కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష ద్రవ్యాతలతో పూజతోపాటు, పంచామృతాభిషేకం, నారికేళ సమర్పణ చేశారు. వ్రతాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వ్రతాల అనంతరం పాల్గొన్న వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నప్రసాదం వితరణ గావించారు.

విద్యార్థుల రోల్ పెరగాలి


మధ్యాహ్నం భోజనం చేస్తున్న చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గంగాధర్

మార్టూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పెరుగుదల కోసం ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి డి. గంగాధర్ అన్నారు. మండలంలోని కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను.. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన ఆయన భోజనం నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



చెట్లు తొలగిస్తున్న పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలో రోడ్లు వెంబడి భారీగా పెరిగిన చిల్లచెట్లను తొలగించే కార్యక్రమాన్ని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి శుక్రవారం నిర్వహించారు. రోడ్ల వెంబడి చిల్లచెట్లు విపరీతంగా పెరిగి పోయి ఇటీవల తరచుగా వాహన ప్రమాదాలు జరుగుతుండటంతో ఆయన దగ్గరుండి చిల్లచెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ పరిధిలోని రామచంద్రనగర్ గ్రామం నుంచి పల్లెపాలెం రోడ్డులో గల చిల్లచెట్లను తొలగించేందుకు జేసీబీతో పనులు నిర్వహించారు.

సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు

చీరాల రూరల్: రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి ప్రసాదించిన సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు చేపట్టాలని ఆత్మ ఎస్‌ఎఫ్‌ఏ లక్ష్మి ప్రసన్న అన్నారు. బుర్లవారిపాలెంలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులు సాగుపై అవగాహన కల్పించారు. ఆత్మ ఎస్‌ఎఫ్‌ఏ లక్ష్మి ప్రసన్న, మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి, బీటీఎం జ్యోతి, వీఏఏ నీలిమ పాల్గొన్నారు.

పాడిరైతులకు ప్రోత్సాహాలు


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారులు

చీరాల అర్బన్: పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చిట్టిబాబు అన్నారు. శుక్రవారం పశువుల్లో లింగ నిర్ధారిత వీర్యం వాడకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు టి.శివారెడ్డి, డి.భాగ్యరాజు, జి.పుష్పలత, గ్రామ పెద్దలు పాకాల నాగరాజు, గవిని సోమయ్య, ఆసాది వీర్లంకారెడ్డి, ఎ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్యాకేజ్డ్ ఫుడ్, కూల్‌డ్రింక్స్ హానికరం

చీరాల రూరల్: ప్యాకేజ్డ్ ఫుడ్, కూల్‌డ్రింక్స్ వంటివి మన ఆరోగ్యానికి హానికరమైనవని, ప్రకృతి ప్రసాదించిన పండ్లతో మన ఆరోగ్యం పదికాలాలపాటు పదిలంగా ఉంటుందని సెయింట్ ఆన్స్ స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్లో ఫ్రూట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆపిల్, అరటి, మామిడి, జామ, ద్రాక్ష పండ్లకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్ జంక్ ఫుడ్ తినడం వలన వచ్చే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ సిస్టర్ ట్రెసా, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి గర్భిణికి అస్వస్థత

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వ వైద్యురాలి అనుభవ రాహిత్యం ఓ గర్భిణి ప్రాణాల మీదకు తెచ్చిపెట్టింది. ఇంజక్షన్ వికటించడంతో అపస్మారక స్థితిలో చేరుకున్న ఘటన దగ్గుబాడులో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దగ్గుబాడు గ్రామానికి చెందిన గోపతోటి ద్వారక తొమ్మిది నెలల గర్భిణి. ఆమెది చీరాల కాగా.. పుట్టింటి వారు చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చెకప్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు రక్తం తక్కువగా ఉందని చెప్పారు. దీంతో అత్తగారి ఊరు అయిన దగ్గుబాడు గ్రామంలోని వైద్య సిబ్బంది తాము ఇక్కడే పీహెచ్‌సీలో వైద్య చికిత్స చేస్తామని చెప్పడంతో ఆమెను ఈ నెల 20వ తేదీ దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆన్‌డ్యూటీలో మహిళా వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ హరిత.. ఎలాంటి పరీక్షలు చేయకుండా ఐరన్ సుక్రోజ్ అనే ఇంజక్షన్ ఇచ్చింది. ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే మహిళ అపస్మారక స్థితిలోకి చేరుకుని సుమారు గంట సేపటి వరకు స్పృహ కోల్పోయింది. గర్భిణికి సీరియస్‌గా ఉందంటూ వైద్యురాలు మొత్తం ఐదు ఇంజక్షన్‌లు ఇచ్చారు. దీంతో బంధువులు 108 వాహనానికి ఫోన్ చేసి చీరాల ప్రభుత్వ వైద్యశాలకు.. అనంతరం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.